# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్.. పాకిస్తాన్‌లకు సంబంధించిన ప్రస్తుత విదేశాంగ విధాన పరిణామాలను విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈరోజు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి వివరించారు.
- ❖ భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ మూడు దేశాల పర్యటనలో భాగంగా ఈ రోజు నెదర్లాండ్స్ చేరుకున్నారు.
- ❖ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో రాజస్థాన్, హర్యానా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.
- ❖ నిర్ణయాత్మక శక్తితో భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి భారత సైన్యం సిద్ధంగా ఉందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25న ప్రసారమవుతుంది.

======================

భారత్.. పాకిస్తాన్‌లకు సంబంధించిన ప్రస్తుత విదేశాంగ విధాన పరిణామాలను భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈరోజు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి వివరించారు. ఆపరేషన్ సిందూర్, పాకిస్తాన్‌తో తదుపరి కాల్పుల విరమణ ప్రకటన గురించి కాంగ్రెస్ పార్టీ ఎంపీ శశి థరూర్ నేతృత్వంలోని కమిటీకి ఆయన వివరించారని అధికారవర్గాలు తెలిపాయి. పహల్గామ్ ఉగ్రవాదుల దాడి, పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారతదేశం ప్రతీకార చర్యల తర్వాత విదేశాంగ విధాన పరిణామాలపై ఒక ప్రభుత్వ ఉన్నత అధికారి పార్లమెంటరీ ప్యానెల్‌కు వివరించడం ఇదే మొదటిసారి.

======================

భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ రోజు ఉదయం నెదర్లాండ్స్‌లోని హేగ్‌లో వ్యూహాత్మక నిపుణులతో సమావేశం నిర్వహించారు. సమావేశ వివరాలను సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన పంచుకున్నారు. నిపుణులతో తనకు మంచి అభిప్రాయాల మార్పిడి జరిగిందని అన్నారు. బహుళ సారూప్యత, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి ఉన్న యుగంలో భారతదేశం, నెదర్లాండ్స్, యూరోపియన్ యూనియన్ బంధం బలపరిచేందుకు లోతుగా చర్చించారమని తెలిపారు. ఇదిలా ఉండగా విదేశాంగ మంత్రి నెదర్లాండ్స్, డెన్మార్క్, జర్మనీ దేశాల పర్యటనలో భాగంగా మొదటి దశలోఈరోజు హేగ్

నగరానికి చేరుకున్నారు. మూడు దేశాల నాయకత్వాలతో ద్వైపాక్షిక సంబంధాలు, పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, ప్రపంచ విషయాలపై ఎస్. జైశంకర్ చర్చలు జరుపుతారని విదేశాంగ మంత్రిత్వ శాఖ (MEA) తెలిపింది.

=======================

సింధునది జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం వల్ల రాజస్థాన్, హర్యానా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌లో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలోని దేశవ్యాప్తంగా ఉన్న వివిధ వర్గాల రైతులతో సంభాషిస్తూ.. మంత్రి ఈ విషయం చెప్పారు. అందరికీ గరిష్ట ప్రయోజనం చేకూర్చేలా భవిష్యత్‌లో ఈ నీటి వినియోగంపై సమగ్ర వ్యూహాన్ని రూపొందిస్తామని మంత్రి తెలిపారు. సింధు జల ఒప్పందాన్ని నిలిపివేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయమని శివరాజ్‌సింగ్ పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

=======================

ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈరోజు రాజస్థాన్‌లోని డిసెర్ట్ సెక్టార్‌లో కోణార్క్ కార్ ముందు ప్రాంతాలలోని లాంగేవాలాను సందర్శించారు. భారత వైమానిక దళాలు సరిహద్దు భద్రతా దళంతో సమన్వయంతో తీసుకున్న ఉమ్మడి చర్యలను కూడా ఆయన సమీక్షించారు. కోణార్క్ కార్ సైనికులతో  సంభాషిస్తు... ఆపరేషన్ సిందూర్ సమయంలో సైనికులు పోషించిన ఆదర్శప్రాయమైన పాత్రను అభినందించారు. శత్రువుల డ్రోన్ చొరబాట్లను విజయవంతంగా తటస్థీకరించినందుకు దళాలను ప్రశంసించారు. కమాండర్లు, యూనిట్ల వృత్తి నైపుణ్యం, ధైర్యం, కార్యాచరణ ప్రణాళికలను సమగ్రంగా అమలు చేయడంపై  ప్రత్యేకంగా అభినందించారు. నిర్ణయాత్మక శక్తితో భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవడానికి భారత సైన్యం సంసిద్ధతను ప్రముఖంగా ప్రస్తావించారు. జాతీయ సార్వభౌమత్వాన్ని కాపాడటానికి, విభిన్నమైన  భద్రతా వాతావరణంలో అధిక కార్యాచరణ సంసిద్ధతను నిర్ధారించడంలో భారత సైన్యం యొక్క నిబద్ధతను పునరుద్ఘాటించారు.

=======================

డిజిటల్ ప్రజా సేకరణ వేదిక అయిన గవర్నమెంట్ ఈ-మార్కెట్ ప్లేస్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ 2047 దార్శనికతకు కీలకమైన శక్తిగా మారిందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ఈ రోజు ఒక ఆంగ్ల వార్తా దినపత్రికలో ఆయన రాసిన ఒక వ్యాసంలో ఈ అంశాలను ప్రస్తావించారు. గవర్నమెంట్ ఈ మార్కెట్ ప్లేస్ ప్రవేశ అడ్డంకులను తొలగించిందని, అవినీతిని నిర్మూలించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న పట్టణాల్లోని అట్టడుగు వర్గాలకు సాధికారత కల్పించిందని, పన్ను చెల్లింపుదారుల నగదును భారీగా ఆదా చేయడానికి వీలు కల్పించిందని మంత్రి పియూష్ గోయల్ తెలిపారు.

విరామం

=======================

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈరోజు న్యూఢిల్లీలో నూతన ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (OCI) పోర్టల్‌ను ప్రారంభించారు. ఇప్పటికే ఉన్న లోపాలను పరిష్కరించడానికి, వినియోగదారు అనుభవాన్ని మెరుగుపరచడానికి ఈ పోర్టల్ అందుబాటులోకి తీసుకొచ్చారు. గత దశాబ్దంలో గణనీయమైన సాంకేతిక పురోగతి, OCI కార్డ్ హోల్డర్ల నుండి వచ్చిన అభిప్రాయాల దృష్ట్యా నూతన OCI పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్లు హోంమంత్రిత్వ శాఖ తెలిపింది.

=======================

మహారాష్ట్రలోని ముంబై-గోవా రహదారిపై ఈ రోజు జరిగిన ప్రమాదంలో  ఐదుగురు మృతి చెందారు. రత్నగిరి సమీపంలోని జగ్బుడి నదిలో కారు పడిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బాధితులు ముంబై నుండి దేవ్రుఖ్‌కు వెళ్తుండగా కారు అదుపు తప్పి నదిలోకి దూసుకెళ్లింది. స్థానికులు, సహాయక బృందాలు  వెంటనే సంఘటనా స్థలానికి

చేరుకున్నారు. ప్రాణాలతో బయటపడిన వ్యక్తిని తక్షణ చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి ఖచ్చితమైన కారణాన్ని గుర్తించడానికి పోలీసులు ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

=======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=======================

జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరి, పూంచ్ సరిహద్దు జిల్లాలలో భద్రతా దళాలు ఈరోజు సంయుక్తంగా గాలింపు చర్యలు ప్రారంభించాయి. రాజౌరి జిల్లా సరిహద్దు ప్రాంతంలో అనుమానిత కదలికలు ఉన్నట్లు వచ్చిన నివేదికల ఆధారంగా భద్రతా దళాలు గాలింపు చర్యలు ప్రారంభించాయి. నిన్న రాత్రి నౌషెరా ప్రాంతంలో ముగ్గురు అనుమానిత వ్యక్తులను ఒక మహిళ గుర్తించినట్లు సమాచారం అందడంతో, ఆ ప్రాంతంలో ఈ రోజు గాలింపు చర్యలు చేపట్టారు. పూంచ్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో మరో భద్రతా బృందం గాలింపు చర్యలు కూడా కొనసాగుతున్నాయి.

=======================

PSLV-C61 రాకెట్ భూ పరిశీలన ఉపగ్రహం EOS-09ను ఉద్దేశించిన కక్ష్యలోకి ప్రవేశపెట్టడంలో విఫలమైన సంఘటనపై దర్యాప్తు చేయడానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ISRO) ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కారణాన్ని గుర్తించడానికి కమిటీ ఇప్పటికే అనేక విడతల చర్చలు నిర్వహించిందని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (PSLV-C61) రాకెట్ నిన్న శ్రీహరికోట నుండి ప్రయోగించిన కొన్ని నిమిషాలకే లోపం ఏర్పడిన తర్వాత ఇస్రో తన భూ పరిశీలన ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టడంలో విఫలమైంది. ఇస్రో భవిష్యత్ ప్రయోగాలను కొనసాగిస్తుందని, ఈ సంవత్సరం ప్రతి నెలా ఒక మిషన్‌ను ప్రయోగించేందుకు ప్రణాళికా సిద్ధం చేసిందని ఆయన స్పష్టం చేశారు.

=======================

వాటికన్ నగరంలో ఈరోజు జరిగిన పోప్ లియో XIV పోంటిఫికేట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి భారత అధికారిక ప్రతినిధి బృందం హాజరయ్యింది. ఈ బృందానికి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో నాగాలాండ్ ఉప ముఖ్యమంత్రి యంతుంగో పాటన్ కూడా పాల్గొన్నారు. వేడుక అనంతరం భారత ప్రతినిధి బృందం పోప్ లియో XIVతో సమావేశమైందని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

=======================

అఖిలభారత పరిపాలన సర్వీస్ అధికారుల డిజిటల్ సంకలనం అయిన ఎలక్ట్రానిక్ సివిల్ లిస్ట్-2025 ఈ-బుక్‌ను కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఈ రోజు న్యూ ఢిల్లీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ భారతదేశ సమాఖ్య పాలనను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. దేశ పరిపాలనా నాయకత్వం యొక్క నిర్మాణాత్మక దృక్పథాన్ని అందిస్తూ... పారదర్శకతకు ఈ-బుక్‌ను ఒక ముఖ్యమైన సాధనమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

=======================
=======================